సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం ၊ 1 ၊ డిసెంబర్ ၊ 2023



అర్హత ఉంటే ఉద్యోగం 8లో

నిరుద్యోగులకు శుభవార్త. విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో నేడు, రేపు జాబ్ మేళా నిర్వహించనున్నారు.



స్టాఫ్ నర్సు పోస్టులకు కౌన్సెలింగ్

స్టాఫ్ నర్సు పోస్టులకు ఎంపికైన వారికి రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించారు. 86 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేశారు. 8లో



మన్యంలో కనిష్ట ఉష్ణోగ్రతలు

సాక్షి, పాడేరు: చలి వణికిస్తోంది. చింతపల్లిలో 13.5, అరకు లోయలో 14.6 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు గురువారం నమోదయ్యాయి.

న్యూస్‌రీల్

నాణ్యతతో రోడ్డు పనులు పూర్తి చేయండి

- రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే



టి. బూరుగుబంద రోడ్డు పనులు పరిశీలిస్తున్న పీవో సూరజ్‌గనోరే

రంపచోడవరం: ఏజెన్సీ మారుమూల ప్రాంతాల్లో రోడ్లను నాణ్యతతో నిర్మించాలని రంపచోడవరం పీవో సూరజ్ గనోరే తెలిపారు. మండలంలోని టి. బూరుగుబంద నుంచి బీవీ కోట వరకు నిర్మిస్తున్న రోడ్డు పనులను గురువారం ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. ఏడు కిలోమీటర్ల మేర రూ. 3.50 కోట్లతో రోడ్డు పనులను గిరిజన సంక్షేమ శాఖ నిర్మిస్తోంది. టీడబ్ల్యూ డీఈ చైతన్య, ఏఈ ఎంవీవీ సత్యనారాయణ ఈ పనుల ప్రగతిని పీవోకు వివరించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ గడువులోగా రోడ్డు పనులు పూర్తి చేసి గిరిజనులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

12న సామాజిక సాధికార బస్సు యాత్ర

- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



పార్టీ కార్యకర్తలతో మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకులోయ రూరల్/డుంబ్రిగుడ: అరకు నియోజకవర్గం హుకుంపేటలో ఈనెల 12న సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతం చేయాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ కోరారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి పార్టీ శ్రేణులు, అనుబంధ రంగాల ప్రతినిధులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. గురువారం ఆయన అరకులోయ, డుంబ్రిగుడలో పార్టీ నాయకులతో వేర్వేరుగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బస్సు యాత్రకు పెద్ద ఎత్తున జన సమీకరణ చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ ఉమ్మడి జిల్లా మాజీ అధికార ప్రతినిధి శెట్టి అప్పాలు, జిల్లా సంయుక్త కార్యదర్శులు శెట్టి వెంకటరావు, గొల్లోరి గోపాల్, వైస్ ఎంపీపీ రామన్న, శెట్టి ఆనందరావు, పార్టీ మండలాధ్యక్షుడు మల్లేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ రాజారమేష్, డైరెక్టర్ బిబి స్రారు, మండల కన్వీనర్ సంపత్‌కుమార్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి హస్తినకుమార్, మొద్దు, సర్పంచ్‌లు వెంకటరావు, నాగేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ శ్రీరాములు, ఉపాధ్యక్షుడు జగ్గునాయుడు, గణపతి, సీనియర్ నాయకులు ముఖి సాంబ, యాసిన్, సోమేష్, రామ్మూర్తి, మాధురి శివ, నర్సింగ్, అప్పాలస్వామి, నగేష్ పాల్గొన్నారు.

రూ.25 లక్షలతో రామాలయ అభివృద్ధి

- టీటీడీ సూపరింటెండెంట్ చంద్రమౌళీశ్వర శర్మ



గ్రామపెద్దలతో మాట్లాడుతున్న టీటీడీ సూపరింటెండెంట్ చంద్రమౌళీశ్వర శర్మ

సాక్షి, పాడేరు: టీటీడీ నుంచి రూ.25 లక్షలతో సుండ్రుపుట్టు పురాతన రామాలయం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని విశాఖ కార్యాలయం సూపరింటెండెంట్ చంద్రమౌళీశ్వర శర్మ తెలిపారు. పట్టణంలోని సుండ్రుపుట్టు రామాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. శ్రీరాముని విగ్రహానికి పూజలు చేసిన అనంతరం గ్రామపెద్దలు, ఆలయ కమిటీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రామాలయ అభివృద్ధిపై సమీక్షించారు. ఇక్కడ గిరిజనుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. టీటీడీ నిధులతో రామాలయాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి, భక్తులకు కానుకగా అందిస్తామన్నారు. టీటీడీ ప్రతినిధి సత్యనారాయణ, సుండ్రుపుట్టు గ్రామపెద్దలు దన్నేటిపలాసి సుబ్బారావు, సమరెడ్డి సింహాద్రిరావు, ఆదినారాయణ, ఆలయ కమిటీ ప్రతినిధులు కృష్ణమూర్తి, గోపాల్, డీపీ సురేష్, బాబూరావు పాల్గొన్నారు.

గిరిజన రైతు పంట పండింది!

ఆనంద్ మహీంద్రా వంటి ప్రముఖులను, ఇటీవల జి–20 సమ్మిట్ ప్రతినిధులను ఫిదా చేసిన మన్యం కాఫీకి అమాంతంగా డిమాండ్ ఏర్పడింది. ఈ నేపథ్యంలో కాఫీ తోటల్లో పక్వానికి వచ్చిన పండ్లను ఏరడమే తరువాయి హాట్ కేకుల్లా అమ్ముడుపోతున్నాయి. గిరిజన రైతుల నుంచి ప్రైవేటు సంస్థలు పోటాపోటీగా కొనుగోలు చేస్తున్నాయి. వీటితో పోటీపడుతున్న ఐటీడీఏ చెల్లిస్తున్న ధరకు అవి బెంబేలెత్తుతున్నాయి.

- మన్యంలో కాఫీ పండ్ల కొనుగోళ్ల జోరు
- పండ్ల దశలోనే అమ్మకాలు
- ఐటీడీఏతోపాటు ప్రైవేట్ సంస్థలు పోటాపోటీ
- కిలో రూ.36 నుంచి రూ.43 వరకు కొనుగోలు
- జిల్లాలో 1.58 లక్షల ఎకరాల్లో కాఫీ ఫలసాయం



గుర్రగరువు గ్రామంలో కాఫీ పండ్లను అమ్మకానికి సిద్ధం చేస్తున్న గిరిజన రైతులు

సాక్షి, పాడేరు: మన్యంలో గిరిజన రైతులు సాగు చేస్తున్న కాఫీ పంటకు భలే గిరాకీ ఏర్పడింది. నాణ్యమైన పాచ్‌మెంట్ కాఫీ గింజలను ఉత్పత్తి చేసే లక్ష్యంతో ఐటీడీఏ ఆధీనంలోని చింతపల్లి మాక్స్‌తోపాటు ఇతర ప్రైవేట్ సంస్థలు, రైతు ఉత్పత్తి సంఘాలన్నీ కొనుగోలుకు పోటీపడుతున్నాయి. కాఫీ తోటల్లో పక్వానికి వచ్చిన పండ్లను వెనువెంటనే కొనుగోలు చేస్తున్నాయి. ప్రస్తుతం పాడేరు డివిజన్‌లోని కాఫీ తోటలున్న గ్రామాల్లో ఇదే ప్రధాన వ్యాపారంగా మారింది. కలెక్టర్ సుమిత్‌కుమార్, పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్‌ల ఆదేశాలతో ఐటీడీఏ కాఫీ విభాగం అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది కాఫీ పండ్ల కొనుగోలులో బిజీగా మారారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి రైతుల నుంచి కాఫీ పండ్లను కొనుగోలు చేస్తున్నారు. కాఫీ పండ్లు పూర్తిస్థాయిలో పక్వానికి రాకపోయినా కాయ, పండు రెండింటిని తూకంలో తేడా లేకుండా కిలో రూ.43తో కొనుగోలు చేస్తున్నారు. కొన్ని ప్రైవేట్ సంస్థలు మాత్రం కిలో రూ.36 నుంచి రూ.40లోపే ధర చెల్లిస్తుండటంతోపాటు తూకంలో మోసాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఏజెన్సీ వ్యాప్తంగా నాలుగు వేల మెట్రిక్ టన్నుల కాఫీ పండ్లను ఐటీడీఏ కొనుగోలు చేసి చింతపల్లి మాక్స్‌కు అందించే లక్ష్యంతో ఉంది. ఇప్పటికే 502 మెట్రిక్ టన్నులను కొనుగోలు చేసింది. దీని ధరతో మాత్రం పలు సంస్థలు బెంబేలెత్తుతున్నాయి అయినప్పటికీ మారుమూల గ్రామాల్లో ఆయా రైతు ఉత్పత్తి సంఘాలు, ప్రైవేట్ సంస్థలు కాఫీ పండ్లను కొనుగోలు చేస్తున్నాయి.

ఐటీడీఏ గిట్టుబాటు ధర అమలు



పాడేరు ఐటీడీఏ కాఫీ పండ్లకు గిట్టుబాటు ధర అమలుజేస్తోంది. కాయ, పండుతో సంబంధం లేకుండా కిలో రూ.43తో కొనుగోలు చేస్తోంది. తూకంలో తేడా ఉండదు. అనేక సంస్థలు పోటీ పడుతున్నప్పటికీ గిరిజన రైతులంతా కాఫీ పండ్లను ఐటీడీఏ కాఫీ విభాగానికే అమ్ముతుండటం సంతోషంగా ఉంది. కాఫీ పండ్లకు సంబంధించి నగదు చెల్లింపులను పారదర్శకంగానే చేపడుతున్నాం. కాఫీ పంట అమ్మకాలు ద్వారా చింతపల్లి మాక్స్ సంస్థకు లాభాలు వస్తే మాత్రం వాటిని కాఫీ పండ్లు విక్రయించిన ప్రతి రైతుకు పంచుతాం.

– వి.అభిషేక్, ఐటీడీఏ పీవో, పాడేరు

79 వేల మెట్రిక్ టన్నుల పండ్ల దిగుబడి

పాడేరు డివిజన్ 11 మండలాల పరిధిలో 2.40 లక్షల ఎకరాల్లో గిరిజన రైతులు కాఫీ తోటలను సాగు చేస్తున్నారు. లక్షా 58 వేల ఎకరాల కాఫీ తోట ఫలసాయం ఇస్తోంది. దాంతో ఈ ఏడాది 78 వేల మెట్రిక్ టన్నుల కాఫీ పండ్ల దిగుబడి వస్తుందని ఐటీడీఏ కాఫీ విభాగం అధికారులు అంచనా వేస్తున్నారు. ఐదు కిలోల కాఫీ పండ్లను పల్పింగ్ చేసి బాగా ఆరబెడితే కిలో పాచ్‌మెంట్ కాఫీ గింజలను ఉత్పత్తి చేయవచ్చు. కాఫీ పండ్లు సేకరించిన తర్వాత పల్పింగ్ చేయడం, బాగా ఆరబెట్టడం వంటి పనులన్నీ రైతులకు కష్టంతో కూడుకున్నది. ఈ పరిస్థితుల్లో పండ్ల దశలోనే అమ్ముకుని ఆదాయం పొందుతున్నారు.



ముంచంగిపుట్టు మండలం కించాయిపుట్టులో కాఫీ పండ్లను కొనుగోలు చేస్తున్న అధికారులు

పాడేరు బోధన ఆస్పత్రిలో పోస్టుల భర్తీకి దరఖాస్తులు

సాక్షి,పాడేరు: వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ పరిధిలోని పాడేరు ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రుల్లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిపై 256 పోస్టులను భర్తీ చేస్తున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాల పాడేరు పరిధిలో 12 కేటగిరీలకు సంబంధించి 66 పోస్టులు, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి పాడేరు పరిధిలో 29 కేటగిరీలకు సంబంధించి 190 పోస్టులు భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. www.visakhapatnam.nic.in వెబ్‌సైట్‌లో పొందుపరిచిన నోటిఫికేషన్‌ను పరిశీలించాలన్నారు. అభ్యర్థులు తమ విద్య, ఉద్యోగార్హతలు, ఇతర ధ్రువపత్రాల జెరాక్స్ సెట్‌ను గజిటెడ్ అధికారితో సంతకం చేయించి వాటిని దరఖాస్తుతోపాటు అందజేయాల్సి ఉంటుందన్నారు. పాడేరు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ కార్యాలయంలో ఈ నెల ఒకటి నుంచి 11వ తేదీ సాయంత్రం 5గంటల లోపు స్వయంగా అందజేయాలని సూచించారు.

సివిల్ సర్వీసెస్, గ్రూప్స్‌కు ఉచిత శిక్షణ

చింతూరు: సివిల్ సర్వీసెస్, గ్రూపు –1, 2 ఉచిత శిక్షణ కోసం మొదటి దశ పరీక్షలో క్వాలిఫై అయిన వారికి రెండో దశ పరీక్ష హాల్ టిక్కెట్లు తీసుకోవాలని ఐటీడీఏ పీవో కావూరి చైతన్య సూచించారు. ఈ నెల 3న రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్ష నిర్వహిస్తామన్నారు. హాల్ టిక్కెట్లు నేటి నుంచి చింతూరు ఐటీడీఏ కార్యాలయంలో జారీ చేస్తారని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఈ నెల 3న ఉదయం 9 గంటలకే కళాశాలలో రిపోర్టింగ్ చేయాలని సూచించారు. అభ్యర్థులు ఏదైనా గుర్తింపు కార్డు, బ్లాక్ బాల్‌పాయింట్ పెన్ తప్పనిసరిగా తీసుకురావాలన్నారు.

విద్యా, వైద్య ఆరోగ్య కార్యక్రమాలు విస్తృతం

- పీఎంజీఎస్‌వై రోడ్ల పనులు వేగవంతం
- నీతి అయోగ్ ప్రభారి అధికారి నాగరాజు

సాక్షి,పాడేరు: జిల్లాలోని విద్యా, వైద్య ఆరోగ్య కార్యక్రమాలను విస్తృతం చేయాలని కేంద్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శి, నీతి అయోగ్ ప్రభారి అధికారి ఎం.నాగరాజు అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలుతీరును పరిశీలించేందుకు గురువారం ఆయన పాడేరులో పర్యటించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, ఇతర అధికారులతో కలిసి ఆయన మినుములూరు గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను సందర్శించారు. ఇక్కడ గిరిజనులకు అందుతున్న పౌర సేవలపై ఆరా తీశారు. అనంతరం పాడేరు మెడికల్ కళాశాల నిర్మాణ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌కు చేరుకున్న ఆయన స్వాతంత్య్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్ని శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాడేరులో కాంక్రీట్ నిర్మాణాలు అధికంగా ఉన్నాయని, స్థానికంగా అందుబాటులో ఉన్న వనరులతో నిర్మాణాలు చేపడితే బాగుంటుందని సూచించారు. పీఎంజీఎస్‌వై పథకంలో రోడ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. భూపరిపాలన, రెవెన్యూ, అటవీ శాఖలు సమన్వయంతో పనిచేసి రహదారుల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలని ఆదేశించారు. ఐసీడీఎస్, ఆరోగ్య శాఖలు సమన్వయంతో పనిచేసి మాతాశిశు మరణాలను నిరోధించాలన్నారు. గర్భిణులకు, బాలింతలకు, శిశువులకు వైద్యబృందాలు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. మాతృ, శిశు మరణాలకు కారణాలను గుర్తించి, వాటి నివారణ లక్ష్యంగా పనిచేయాలన్నారు. ప్రభుత్వ ఆధీనంలోని వివిధ యాజమాన్యాల విద్యా సంస్థల మధ్య సమన్వయం ఏర్పడి విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు.



మినుములూరు గ్రామ సచివాలయం సేవలను ఆరాతీస్తున్న నీతి అయోగ్ ప్రభారి అధికారి నాగరాజు



పాడేరు మెడికల్ కళాశాల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న నీతి అయోగ్ ప్రభారి అధికారి నాగరాజు

జాతీయ సగటుతో పోల్చుకుంటే జిల్లాలో బడి మానేసిన విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఏజెన్సీలో కాఫీ, మిరియాల పంటల సాగు బాగుందని, ఉద్యానవన పంటల సాగును మరింత విస్తరించాలని సూచించారు. సమాచార సాంకేతిక వ్యవస్థ మెరుగుకు సెల్‌టవర్ల ఏర్పాటు చర్యలను ప్రశంసించారు. స్కిల్‌హబ్ ద్వారా చేపట్టిన శిక్షణా కార్యక్రమాలు, ఉపాధి కల్పనపై ఆయన ఆరా తీశారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ శివశ్రీనివాస్ జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో డీఆర్వో అంబేడ్కర్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సచివాలయాలతో గాంధీజీ కలల సాకారం

సచివాలయ భవనాల ప్రారంభోత్సవంలో పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



లంబసింగి సచివాలయంలో రిబ్బన్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

చింతపల్లి రూరల్: మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థతో సాకారమవుతుందని పాడేరు ఎమ్మెల్యే కొట్టిగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని కొత్తపాలెం –1, 2, లంబసింగిలో నూతన సచివాలయ భవనాలను గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఈ వ్యవస్థను ఏర్పాటు చేసుకునేందుకు పలు రాష్ట్రాలు ఆసక్తి చూపుతున్నాయన్నారు. ప్రతి పనికి వందల రూపాయలు ఖర్చు చేసుకుని మండల కేంద్రాలకు వెళ్లే ప్రజలు ఇప్పుడు ఇళ్ల వద్దే వలంటీర్ల ద్వారా సులభంగా చేయించుకుంటున్నారన్నారు. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు ప్రజలకు వరమన్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవంగా చెప్పుకునే టీడీపీ అధినేత చంద్రబాబు రాష్ట్రంలో గుర్తుండి పోయే ఒక్క పనైనా చేశారా? అని ప్రశ్నించారు.

కార్యక్రమంలో ఎంపీపీ అనూషాదేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, పీఆర్ డీఈ నరేస్ కుమార్, జేఈ బాలకిశోర్, ఎంపీడీవో ఆశాజ్యోతి, వైస్ ఎంపీపీలు వెంగళరావు, శారద, లంబసింగి, కొత్తపాలెం సర్పంచ్‌లు శాంతి కుమారి, వనగల సోమరత్నం, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షురాలు పుష్పలత, డీసీసీబీ చైర్మన్ సీతారాం, పార్టీ మండలాధ్యక్షుడు మోరి రవి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ మీరా, సర్పంచ్‌లు గోపాల్, పండయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి గణబాబు, ఎంపీటీసీలు నాగమణి, నూకరాజు, మోహన్‌రావు, లోవరాజు పద్మ, కో–ఆప్షన్ సభ్యుడు నాజర్‌వలీ, జిల్లా కన్వీనర్ కురుసా తిరుపతి, నాయకులు రఘునాథ్, బెన్నిబాబు, యూసేఫ్, శ్రీరాములు పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు కృషి

ఆధ్యాత్మిక ప్రవచనకర్త కొండవీటి జ్యోతిర్మయి

చింతపల్లి రూరల్: హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన గాయని, ఆధ్యాత్మిక ప్రవచనకర్త కొండవీటి జ్యోతిర్మయి అన్నారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం చింతపల్లిలో హిందూ గిరిజన సాంస్కృతిక సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం గిరిజనుల జీవనశైలీ విధానంలో ప్రాచీన కలలను గౌరవించడం, సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణార్థం ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ భక్తి భావం కలిగి ఉండటం వల్ల మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. చేయూత వారియర్స్ ట్రస్ట్ ఆధ్వర్యాన భక్తులకు భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భీమిలి సాయిరాం స్వామీజీ, రామానంద స్వామీజీ, ఇందిరాదేవి, వెంకటరమణ, గెమ్మిలి మోహన్‌రావు, దూనబోయిన రమణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీటీడీ ఆస్థాన గాయని, ఆధ్యాత్మిక ప్రవచనకర్త కొండవీటి జ్యోతిర్మయి

గిరిజనుల్లో వెల్లివిరుస్తున్న ఆధ్యాత్మికత

గూడెంకొత్తవీధి: కనీస సదుపాయాలు లేని చోట గిరిజనులు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తూ హిందూ ధర్మాన్ని ఆచరిస్తున్నారని ఆధ్యాత్మిక ప్రవచన కర్త గురుకొండవీటి జ్యోతిర్మయి ప్రశంసించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆమె గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆలయాల వద్ద భక్తి గీతాలను ఆలపించి మంత్రముగ్ధుల్ని చేశారు.

మన్యంలో హెచ్‌ఐవీకి చెక్

- విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు
- వైద్య ఆరోగ్య శాఖ విశేష కృషి

సాక్షి,పాడేరు: జిల్లాలో హెచ్‌ఐవీ నియంత్రణలో పురోగతి కనిపిస్తోంది. జిల్లా వ్యాప్తంగా వైద్య ఆరోగ్యశాఖ వివిధ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తోంది. పర్యవసానంగా హెచ్‌ఐవీ తీవ్రత అదుపులోకి వచ్చింది. ఎయిడ్స్ కంట్రోల్ విభాగం ఆధ్వర్యంలో జిల్లాలోని అరకులోయ, పాడేరు, రంపచోడవరం, చింతపల్లి, చింతూరు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఐదు ఐసీటీసీ సెంటర్లు పనిచేస్తున్నాయి. అన్ని ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గర్భిణులకు, వారి భర్తలకు ఆయా ఐసీటీసీ సెంటర్లలో నిరంతరం రక్తపరీక్షలు నిర్వహిస్తున్నారు. హెచ్‌ఐవీ కేసులు నమోదైతే వారి ఆరోగ్య పరిరక్షణకు వైద్య బృందాలు నిరంతరం శ్రమిస్తున్నాయి. వైద్య బృందాలు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపడుతున్నాయి. దాంతో హెచ్‌ఐవీ తీవ్రత అదుపులోనే ఉంది. జిల్లాలో ఇంత వరకు 376 హెచ్‌ఐవీ కేసులు ఉండగా, 293 మంది ఏఆర్టీ సెంటర్లలో మందులను వినియోగిస్తున్నారు. వీరు గతంలో మందులు కోసం రాజమహేంద్రవరం, కాకినాడ, విశాఖ కేజీహెచ్‌కు వెళ్లే పరిస్థితి ఉండేది. రెండేళ్ల నుంచి రంపచోడవరంలో ఏఆర్టీ సెంటర్, చింతపల్లి, పాడేరు, ముంచంగిపుట్టు, అరకులోయ ఆస్పత్రుల్లో లింక్ ఏఆర్టీ సెంటర్ల ద్వారా పొందుతూ ఆరోగ్యంగా జీవిస్తున్నారు. 79 మంది హెచ్‌ఐవీ/ఎయిడ్స్ బాధితులకు ప్రభుత్వం పింఛన్లను పంపిణీ చేస్తోంది.



పాడేరులో హెచ్‌ఐవీపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య బృందాలు

పాడేరులో కొవ్వొత్తులతో భారీ ర్యాలీ

ప్రపంచ హెచ్‌ఐవీ/ఎయిడ్స్ దినోత్సవం పురస్కరించుకుని గురువారం రాత్రి పాడేరులో కొవ్వొత్తులతో భారీ ర్యాలీ నిర్వహించారు. జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ తమర్బ విశ్వేశ్వరనాయుడు ఆధ్వర్యంలో వైద్య బృందాలు ర్యాలీ నిర్వహించాయి. హెచ్‌ఐవీ నియంత్రణ కార్యక్రమాలు, అందుబాటులో ఉన్న వైద్య సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాయి. వైద్య సిబ్బంది శెట్టి నాగరాజు, లక్ష్మణరావు, రమణ పాల్గొన్నారు.

పరీక్షలు నిరంతర ప్రక్రియ



జిల్లాలో ఐసీటీఎస్ సెంటర్లు సమర్థవంతంగా పని చేస్తున్నాయి. గర్భిణులు, వారి భర్తలతో పాటు అనుమానిత రోగులకు హెచ్‌ఐవీ పరీక్షలు నిరంతరం చేస్తున్నాం. ఏఆర్టీ సెంటర్లలో మందులు అందుబాటులో ఉండటంతో బాధితులకు ఎంతో మేలు కలుగుతోంది.

– డాక్టర్ జమాల్ బాషా, డీఎంహెచ్‌వో, పాడేరు

14 మంది గిరిజన విద్యార్థుల ప్రతిభ



బహుమతి పొందిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

అరకులోయ రూరల్: జాతీయ స్థాయి క్విజ్ పోటీల్లో స్థానిక ప్రభుత్వ మహిళా, బాలుర డిగ్రీ కళాశాలలకు చెందిన 14 మంది విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారు. 15వ ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమంలో భాగంగా చెన్నైలో గత నెల 22 నుంచి 28వ తేదీ వరకు ఈ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు భరత్‌కుమార్‌నాయక్, రామకృష్ణ వారిని గురువారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటువంటి ప్రత్యేకమైన గిరిజన సంస్కృతి, సంప్రదాయ, క్రీడ, క్విజ్ పోటీలు నిర్వహించడం వల్ల విద్యార్థులకు మరింత నైపుణ్యం పెంపొందించుకునేందుకు దోహదపడతాయన్నారు. భవిష్యత్తులో ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించినా ప్రతిభాపాటవాలు సాధించి మంచి పేరు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాళ్లు చలపతిరావు, పుష్పరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నెరవేరుతున్న 'గడపగడపకు' హామీ

కాకూరు– ఎల్లివాడ రోడ్డు పనులకు ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు శంకుస్థాపన

మారేడుమిల్లి: 72 ఏళ్ల నుంచి నిరీక్షిస్తున్న కాకూరు, ఎల్లివాడ ఆదివాసీల కల ఫలించింది. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇచ్చిన హామీ మేరకు మండలంలోని మర్రివాడ నుంచి కాకూరు, ఎల్లవాడ గ్రామాలకు రూ. 4.40 కోట్లతో తొమ్మిది కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు గురువారం శంకుస్థాపన చేశారు. మూడు నెలల్లో ఈ రోడ్డు నిర్మించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కనీసం రోడ్డు సౌకర్యం లేక ఆయా గ్రామాల గిరిజనులు నానా అవస్థలు పడేవారన్నారు. 20 సంవత్సరాలుగా ఏజెన్సీని పాలించిన టీడీపీ నాయకులు కనీసం ఈ రోడ్డు గురించి పట్టించుకున్న పాపానపోలేదన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక సీఎం జగన్‌మోహన్ రెడ్డి మారుమూల గ్రామాల అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని తెలిపారు.

భూపట్టాల పంపిణీ...

స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద గిరిజనులకు భూ పట్టాలను ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు పంపిణీ చేశారు. ఏజెన్సీలో 19 వేల మందికి 47వేల ఎకరాల అటవీ భూములపై హక్కు కల్పించామన్నారు. వారందరికీ రైతు భరోసా వర్తిస్తుందన్నారు. అనంతరం స్థానిక వన విహారి వద్ద రూ. 22 లక్షలతో నిర్మించిన బెంబో రెస్టారెంట్‌ను జక్కంపూడి విజయలక్ష్మితో కలిసి ప్రారంభించారు. ఎంపీడీవో వీరా కిశోర్, ఎంపీపీ సార్ల లలితకుమారి, పార్టీ మండల కన్వీనర్ సత్తి సత్యనారాయణ రెడ్డి, మండల కార్యదర్శి గంగరాజు, కో–ఆప్షన్ సభ్యుడు గురుకు ధర్మరాజు, జేసీఎస్ కన్వీనర్ గొర్లె అనిల్ ప్రసాద్ (బాబీ), ఏఎంసీ డైరెక్టర్ దూడ స్మిత్, సర్పంచ్‌లు కొండా జాకబ్, ప్రభాకర్ రెడ్డి, వైస్ సర్పంచ్ వీరబాబు, యూత్ సభ్యులు సత్తి సునీల్ కిశోర్ రెడ్డి, విక్టర్ బన్ను, మారేడుమిల్లి ఇన్‌చార్జి ప్రేమ్, నాయకులు సార్ల లింగారెడ్డి, అనిదీప్ కుమార్, రాధాకృష్ణ పాల్గొన్నారు.



ఎల్లివాడలో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు

క్లుప్తంగా

ఎస్పీ తుహిన్‌సిన్హాను కలిసిన సీఐ రమేష్



ఎస్పీకి మొక్క అందజేస్తున్న సీఐ రమేష్

సాక్షి, పాడేరు: ఎస్పీ తుహిన్‌సిన్హాను జి.మాడుగుల సీఐ సవరపు రమేష్ గురువారం కలిసి తన జాయినింగ్ రిపోర్టు అందజేశారు. పండ్ల మొక్క ను అందజేసి తనను పరిచయం చేసుకున్నారు. జి.మాడుగుల సర్కిల్‌కు సంబంధించి జి.మాడుగుల, ముంచంగిపుట్టు, పెదబయలు పోలీసు స్టేషన్ల పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ లక్ష్యంగా పనిచేయాలని ఈ సందర్భంగా ఎస్పీ సూచించారు.

గృహిణులకు స్పోకెన్ ఇంగ్లిష్‌లో ఉచిత శిక్షణ

సీతంపేట: గృహిణులకు స్పోకెన్ ఇంగ్లిష్‌లో రెండు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు గృహిణి స్పోకెన్ ఇంగ్లిష్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు దామోదర మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. రామాటాకీస్ సమీపంలో కెనరా బ్యాంకు ఎదురుగా శ్రీకృష్ణ ట్రావెల్స్ మేడ మీద ఉన్న సంస్థ కార్యాలయంలో ఈనెల 4 నుంచి ఫిబ్రవరి 4 వరకు ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి గల గృహిణులు ఇనిస్టిట్యూట్‌కి వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 8019388999 నంబరుకు సంప్రదించాలన్నారు.

రాష్ట్ర సమగ్రాభివృద్ధి జగనన్నతోనే సాధ్యం



బెన్నవరంలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొటగుళ్లి భాగ్యలక్ష్మి, నాయకులు

చింతపల్లిరూరల్: రాష్ట్ర సమగ్ర అభివృద్ధి ముఖ్యమంత్రి జగనన్నతోనే సాధ్యమని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని బెన్నవరంలో గురువారం జరిగిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ సీపీ జెండాను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న పాలనలో పారదర్శకంగా, పార్టీలకతీతంగా గడప గడపకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. గత ప్రభుత్వానికి, మన ప్రభుత్వానికి వ్యత్యాసం ఏమిటో గిరిజనులకు వివరించారు. గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ప్రజలకు మెచ్చిన రీతిలో అభివృద్ధి చేసే విధంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. మరలా జగనన్న ముఖ్యమంత్రిగా వస్తేనే ఆంధ్రప్రదేశ్‌కి మంచి జరుగుతుందన్నారు. ఇందుకోసం రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపి, జగన్‌మోహన్‌రెడ్డిని మరలా ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని కోరారు. ఎంపీపీ అనూషాదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, ఎంపీడీవో ఆశాజ్యోతి, తహసీల్దార్ లచ్చపాత్రుడు, సర్పంచ్‌లు దురియా పుష్పలత, సన్యాసమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు మోరి రవి, స్వచ్ఛంద్రా కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మీరా, డీసీసీబీ చైర్మన్ సీతారాం, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి గణబాబు, ఎంపీటీసీ సభ్యులు సోని, పద్మ, కో–ఆప్షన్ సభ్యుడు నాజర్‌వలీ, జిల్లా కన్వీనర్ తిరుపతి, నాయకులు యూసుఫ్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీకేల్లో రాగుల కొనుగోలు కేంద్రాలు

రాగులు క్వింటా రూ.3648 ధరతో కొనుగోలు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అగ్రో కమిషన్ డైరెక్టర్ సన్యాసి, అధికారులు

పెదబయలు: ప్రభుత్వం గిరిజన రైతులు పండించిన రాగి పంటకు మంచి మద్దతు ధర ఎన్నడు లేని విధంగా కొనుగోలు చేస్తున్నారని రాష్ట్ర ఆగ్రో కమిషన్ డైరెక్టర్ వనల్ప సన్యాసి, జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ జి.గణేష్‌కుమార్ అన్నారు.మండలంలోని అడుగులపుట్టు రైతు భరోసా కేంద్రంలో రాగులు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పంటను కేంద్రానికి తీసుకొచ్చేందుకు రైతులకు గోనెలు ఉచితంగా అందజేస్తున్నట్టు తెలిపారు. జిల్లా మొత్తం 4000 మెట్రిక్ టన్నుల రాగులు కొనుగోలు లక్ష్యంగా కాగా పెదబయలు మండలంలో 300 మెట్రిక్ టన్నుల రాగులు కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించినట్టు తెలిపారు. మూడు నెలల పాటు రైతు భరోసా కేంద్రాల్లో రాగులు కొనుగోలు చేయనున్నామన్నారు. రాగి పంట కొనుగోలు ధర, రైతు ఆధార్ అనుసంధానం చేయడం జరుగుతుందని ఏడు రోజుల్లో రైతుల బ్యాంకు ఖాతాల్లో పంట నగదుతో పాటు రవాణా చార్జీలను ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు ప్రవేట్ వ్యాపారులకు పంట విక్రయించకుండా, ఆర్బీకేల్లో అమ్మకాలు చేయాలని కోరారు. సర్పంచ్ కొర్ర వరహాలక్ష్మీ, మండల వ్యవసాయ అధికారి ఎ.శ్రీనివాస్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కృష్ణారావు, మార్కెట్ కమిటీ సభ్యురాలు ధనలక్ష్మి పాల్గొన్నారు.

జి.మాడుగుల: రాష్ట్ర ప్రభుత్వం పౌర సరఫరాల శాఖ ద్వారా ఖరీఫ్ సీజన్ రాగిపంటను కనీస మద్దతు ధర క్వింటాకు రూ.3846 చొప్పున రైతుల నుంచి ఈ–పంట నమోదు ఆధారంగా డిశంబర్ 1 నుంచి కొనుగోలు చేస్తోందని మండల వ్యవసాయశాఖ అధికారి ఎల్.పాత్రుడు చెప్పారు. ఆయన గురువారం మాట్లాడుతూ మండలంలో వంజరి గ్రామ సచివాలయం, పాలమామిడి సచివాలయ పరిధిలో గ్రామాల్లోని ఆర్బీకేల్లో రాగులు కొనుగోలు చేస్తారన్నారు. పీఏసీఎస్ సహకారంతో పౌర సరఫరాల శాఖ ద్వారా రాగుల పంట కొనుగోలు జరుగుతుందన్నారు. వ్యవసాయ, ఉద్యాన సహాయకులను సంప్రదించి ఈ–క్రాప్ నమోదు చూసుకొని నాణ్యమైన పంటను కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని సూచించారు.

నాలుగుకాళ్ల కోడి పిల్ల జననం



వీఆర్‌పురం: నాలుగు కాళ్ల కోడిపిల్ల జన్మించిన కాసేపటికే మరణించిన ఘటన వీఆర్ పురంలో గురువారం చోటు చేసుకుంది. ఇక్కడ ఎలక్ట్రీషియన్ ముత్యాల రాంబాబు ఇంట్లో గురువారం ఉదయం నాటుకోడి పొదిగింది. దాంతో గంపలో నుంచి కోడిపిల్లల అరుపులు వినిపించాయి. వాటిని ఆయన పరిశీలించగా, ఇతర పిల్లల కంటే భిన్నంగా ఒక పిల్లకు నాలుగు కాళ్లు, నాలుగు రెక్కలు ఉండటంతో ఆశ్చర్యపోయాడు. ఈ వింతను స్థానికులు ఆసక్తిగా తిలకించారు. పుట్టిన కొద్ది సమయానికి ఆ కోడి పిల్ల మరణించిందని రాంబాబు చెప్పాడు. జన్యుపరమైన లోపాల వల్ల ఇలాంటివి అరుదుగా చోటు చేసుకుంటాయని వెటర్నరీ వైద్యులు తెలిపారు.

ఆత్మీయ వీడ్కోలు



మాట్లాడుతున్న పాడేరు ఏఎస్పీ ధీరజ్

జి.మాడుగుల: ఉద్యోగం నిబద్ధతతో పనిచేసినప్పుడు ఆ వ్యక్తిని ఉన్నత స్థానాలకు తీసుకెళ్తోందని పాడేరు ఏఎస్పీ ధీరజ్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐగా పనిచేసి అనకాపల్లి జిల్లాకు బదిలీపై వెళ్తున్న ఎ.సత్యనారాయణకు గురువారం రాత్రి పోలీస్ స్టేషన్‌లో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పాడేరు ఏఎస్పీ ధీరజ్ మాట్లాడుతూ సీఐ సత్యనారాయణ పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాలను గౌరవిస్తూ తన కర్తవ్యాన్ని, ఉద్యోగ ధర్మాన్ని నిర్వహించారన్నారు.ప్రభుత్వ ఉద్యోగులకు, పోలీస్‌లకు బదిలీలు, ఉన్నతులు సహజమని ఎక్కడ పనిచేసినా ప్రజలకు మంచి సేవలు అందించి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు.అనంతరం ఏఎస్పీ ధీరజ్,ఎస్ఐ శ్రీనివాసరావు, సీఆర్‌పీఎఫ్, పోలీస్ సిబ్బంది కలసి సీఐ సత్యనారాయణకు శాలువాలను కప్పి ఘనంగా సన్మానించారు.అలాగే కొత్తగా బదిలీపై వచ్చిన రమేష్‌ను శాలువ కప్పి సన్మానించారు. పాడేరు డీఎస్పీ కె.వి.రమణ, నూతన సీఐ రమేష్, సీఆర్‌పీఎఫ్ 198 బిఎన్ డీఎస్పీ ఉదయ్‌కుమార్, ఎస్ఐ శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి విశేష కృషి



ఏకలవ్య పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు

రంపచోడవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్రంలో విద్యాభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్(అనంతబాబు)లు అన్నారు. రంపచోడవరం సమీపంలోని పెదగెద్దాడ వద్ద రూ. 1.20 కోట్లతో నిర్మిస్తున్న ఏకలవ్య పాఠశాల భవనానికి గరువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధనలక్ష్మి మాట్లాడుతూ నాడు–నేడు ద్వారా పాఠశాలల్లో అనేక మౌలిక వసతులు కల్పించారని, కొత్త భవనాలు నిర్మించినట్టు తెలిపారు. విద్యతోనే కుటుంబాలు ఆర్థికాభివృద్ధి సాధిస్తాయన్నారు. దీనికి అనుగుణంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో అనేక మార్పులు చేశారన్నారు. ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు పండా వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ పండా కుమారి, సర్పంచ్ వడగల ప్రసాద్, ఎంపీటీసీలు ఉలవల లక్ష్మి, ముచ్చిక సాయిబాబా, తుర్రం వెంకటేశ్వర్లుదొర, అన్నవరం డైరెక్టర్ కారుకోడి పూజ, నాయకులు రామకృష్ణదొర, మాజీ ఎంపీపీ సత్యనారాయణరెడ్డి, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.అనంతరం రంపచోడవరం మండలం వెట్టిచెలకలు, దబ్బవలస గ్రామాల్లో వాలీబాల్ కిట్లును ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్యే అనంతబాబులు అందజేశారు. వారు మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో క్రికెట్, వాలీబాల్ క్రీడలపై ఆసక్తి ఉన్న, వారి వద్ద క్రీడ సామాగ్రి కొనుగోలు చేసేందుకు డబ్బులు లేకపోవడం గుర్తించి వారి కిట్లును పంపిణీ చేశామన్నారు.క్రీడల్లో యువతను ప్రోత్సాహించేందుకు తమ కృషి చేస్తామన్నారు.

ధాన్యం కొనుగోలుకు ప్రత్యేక చర్యలు

- జిల్లా వ్యాప్తంగా 46 కొనుగోలు కేంద్రాలు
- మండలంలో 5వేల టన్నుల కొనుగోలు లక్ష్యం
- సివిల్ సప్లయ్స్ జిల్లా మేనేజర్ గణేష్‌కుమార్

రాజవొమ్మంగి: ఖరీఫ్ సీజన్‌కు సంభందించి ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 30 వేల టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం కాగా ఒక్క రాజవొమ్మంగిలోనే 5వేల టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామని సివిల్ సప్లయ్స్ డిస్ట్రిక్ట్ మేనేజర్ గణేశ్‌కుమార్ అన్నారు. ఆయన గురువారం ‘సాక్షి’ కి వివరాలు అందజేస్తు జిల్లా వ్యాప్తంగా 46 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. శనివారం దేవీపట్నం మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించేందుకు సన్నద్ధమయ్యామని, మరో వారం రోజుల్లో రాజవొమ్మంగి మండలం శరభవరం, జడ్డంగి, రాజవొమ్మంగి, దూసరపాము, లబ్బర్తి, కొమరాపురం ఆర్బీకేల వద్ద కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ఇప్పటికే గంగవరం, చింతూరు, దేవీపట్నం మండలాలకు 60వేల గోనె సంచులు ఆయా కొనుగోలు కేంద్రాలకు తరలించగా, రాజవొమ్మంగికి శుక్రవారం 15వేల సంచులు సరఫరా చేస్తున్నామన్నారు. గ్రేడ్–ఏ రకం క్వింటా రూ.2,203, సాధారణ రకం క్వింటా రూ.2,183 మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించిందన్నారు. రైతులు పండిన ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించుకోవాలని డీఎం రైతులను కోరారు.

స్కై మార్షల్ ఆర్ట్స్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న నాయకులు

ఆనందపురం : మండలంలోని శొంఠ్యాం ఉన్నత పాఠశాలలో స్కైమార్షల్ ఆర్ట్స్ రాష్ట్ర స్థాయి పోటీలకు గురువారం ఎంపిక కార్యక్రమం జరిగింది. అండర్–14, 17, 19 విభాగాలలో పోటీలు నిర్వహించగా విశాఖ, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల నుంచి 210 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వారిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేయగా వారు ఈ నెల 11,12 తేదీల్లో పాడేరులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన వారితో పాటు గోవాలో జరిగిన 37 నేషనల్ గేమ్‌లో రాష్ట్రం నుంచి పాల్గొన్న పోతిన ప్రవీణ్, జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన రామవరం క్రీడాకారిణి యర్ర సిరి, రన్నింగ్‌లో సిల్వర్ మెడల్ సాధించిన శొంఠ్యాం క్రీడాకారిణి కె.ఉదయశ్రీని నాయకులు, ఉపాధ్యాయులు అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు లెంక రాంబాబు, మండల పార్టీ అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, సీనియర్ నాయకుడు కాకర్లపూడి శ్రీకాంత్‌రాజు, వైస్ ఎంపీపీ పాండ్రింకి శ్రీను, మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎ.అప్పలరాము, టీమ్ మేనేజర్ గవర ఈశ్వర రావు, గుడిలోవ దేవస్థానం చైర్మన్ కోరాడ గిరిరాజు, కోరాడ వెంకటరమణారావు, గొలగాని కృష్ణ, గొలజాన రవి, షిణగం రాంబాబు, కోళ్ల అప్పలస్వామి పాల్గొన్నారు.

అర్హత ఉంటే ఉద్యోగం

- 70 కంపెనీలు 7వేల మందికి ఉపాధే ధ్యేయంగా జాబ్‌మేళా
- నేడు,రేపు నిర్వహణ
- వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్ ఆధ్వర్యంలో..

మల్కాపురం : పారిశ్రామికవాడ నిరుద్యోగులకు శుభ వార్త. ఏపీ సూక్ష్మ చిన్నమధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం, శనివారాల్లో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నారు. అర్హత ఉంటే చాటు ఐటీ, ఫార్మా, ఎలక్ట్రానిక్ తదితర రంగాల్లో సుమారు 7వేల ఉద్యోగాలను ఒకే వేదికపై కల్పించనున్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో ఆడారి ఆనంద్‌కుమార్ ఈ గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మెగా జాబ్ ఫేర్‌ను పురస్కరించుకుని 59వ వార్డు జింక్ ఆంజనేయస్వామి ఆలయం ఎదురుగా గల అండాలమ్మ కళాశాల వద్ద గురువారం ఆడారి ఆనంద్‌కుమార్ మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో యువతకు ఉపాధి కల్పించాలనే ఆలోచనతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాల్లో భాగంగా ఆయా ప్రాంతాల్లో నిరుద్యోగులు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గమనించామన్నారు. నియోజకవర్గంలో ఎక్కువ పరిశ్రమలున్నాయని, అయితే స్థానికులకు అక్కడ ఉపాధి లభించడం లేదన్న విషయాన్ని నిరుద్యోగులు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. ఈ విషయంపై నాలుగు నెలల నుంచి పార్టీ రాష్ట్ర సలహాదారుడు మిలీనియం శ్రీధర్‌రెడ్డితో చర్చించి ఇక్కడ పరిశ్రమల్లో స్థానికులకు ఉపాధి కల్పించేలా మెగా జాబ్‌మేళాకు శ్రీకారం చుట్టామన్నారు. గోపాలపట్నంలోగానీ పారిశ్రామికవాడలో మరోమారు జాబ్ మేళా నిర్వహిస్తామన్నారు. మిలీనియం శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ నిరుద్యోగులకు ఇదో గొప్ప అవకాశమని, ఈ మెగా జాబ్‌మేళాలో 70 కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. సుమారు 5 నుంచి 7 వేల మందికి ఉపాధి లభించడం ఖాయమన్నారు. వివరాలకు 9000818467 , 9000938467 నంబర్లలో సంప్రదించాలన్నారు. 59వ వార్డు జింక్ ఆంజనేయస్వామి ఆలయం ఎదురుగా గల అండాలమ్మ కళాశాల్లో శుక్ర,శనివారాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రినాథ్, కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, మాజీ ఎమ్మెల్యే ఎస్ఏ రెహ్మాన్, పారిశ్రామిక ప్రాంత ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్ యాదవ్, పలు వార్డుల కార్పొరేటర్లు పీవీ సురేష్, గుండపు నాగేశ్వరరావు, బల్లా లక్ష్మణరావు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



గుర్తు తెలియని మృతదేహం

మోతుగూడెం: స్థానిక పంచాయతీ పొల్లూరు గ్రామం తడికా వాగులో గుర్తుతెలియని మృతదేహాన్ని మోతుగుడెం పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. స్థానికులు, వీఆర్వో సమాచారం మేరకు ఎస్సై గోపాలరావు అక్కడకు వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం కోసం చింతూరు ఆస్పత్రికి తరలించారు. వారం రోజుల నుంచి అతడు (65) ఇక్కడ భిక్షాటన చేస్తూ మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రీడా కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

డుంబ్రిగుడ: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీపీవో కార్యాలయంలో గ్రామ సచివాలయ సిబ్బంది, అధికారులతో ఆయన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ యువతలో క్రీడాస్ఫూర్తిని నింపేందుకు, క్రీడలపై ఆసక్తి పెంచేందుకు ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని చేపడుతోందన్నారు. పోటీల్లో పాల్గొనదలిచే తమ పరిధిలోని గ్రామ సచివాలయాల్లో పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. 1902 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా కూడా పేర్లు నమోదు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. పోటీల్లో నగదు బహుమతి రూ.20వేల నుంచి రూ.5 లక్షల వరకు ఉందన్నారు.అనంతరం క్రీడా సామగ్రిను పంచాయతీ అధికారులకు అందజేశారు. ఎంపీడీవో ఉషారాణి, వైస్ ఎంపీపీ ఆనందరావు, సర్పంచ్ వెంకటరావు, మండల పార్టీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు మల్లేశ్వరరావు, జగ్గునాయుడు, నాయకులు సింహాచలం, కృష్ణారావు పాల్గొన్నారు.

స్టాఫ్ నర్సు పోస్టులకు కౌన్సెలింగ్

మహారాణిపేట: స్టాఫ్ నర్సు పోస్టులకు ఎంపికైన వారికి గురువారం రెండో విడత కౌన్సిలింగ్ నిర్వహించారు. మొత్తం 86 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేశారు. తొలి విడత నవంబర్ 7న కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్ ఇచ్చారు. విజయనగరం మెడికల్ కాలేజీలో 80 పోస్టులు, వైద్య విధాన పరిషత్‌లో ఆరు పోస్టులకు ఎంపిక చేశారు. 52 పోస్టులు భర్తీ చేశారు. రెండో విడతలో 34 పోస్టుల కోసం అభ్యర్థులను పిలిచారు. రెండు పోస్టులకు అర్హత గల అభ్యర్థులు లేరు. రెండు పోస్టులకు అభ్యర్థులు హాజరు కాలేదు. ఐదుగురు అభ్యర్థులు పోస్టుల భర్తీలో అన్‌విల్లింగ్ చూపించారని వైద్య ఆరోగ్యశాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ బి.సుజాత తెలిపారు. ఇందులో రెండు పోస్టులు మన్యం జిల్లా పీహెచ్‌సీల్లో భర్తీ చేశామన్నారు. 21 మందిని విజయనగరంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ కోసం భర్తీ చేశామన్నారు. మిగిలిన పోస్టులు త్వరలో భర్తీ చేస్తామన్నారు. దీనిపై క్లారిఫికేషన్ కోసం ప్రభుత్వానికి లేఖ రాస్తున్నామని ఆర్‌డీ సుజాత తెలిపారు.

‘నేవీ’న్యాసాలు అదుర్స్





విశాఖ తీరంలో యుద్ధనౌకలు గర్జించాయి. గగన తలంలో విమానాలు రయ్యిన దూసుకెళ్లాయి. నింగీ నేలపై విన్యాసాలు వావ్ అనిపించాయి. ఈనెల 4న నేవీ డేని పురస్కరించుకొని గురువారం సాయంత్రం రిహార్సల్స్ ఆర్కే బీచ్ వేదికగా నిర్వహించారు. సైనికుల వీరోచిత పోరాటాలు ప్రదర్శించారు. సముద్రంలో ప్రమాదంలో చిక్కుకున్న వ్యక్తిని హెలికాప్టర్ ద్వారా రక్షించే విధానాన్ని కళ్లకు కట్టినట్టు చూపించారు. వాటర్ బాంబులు దాడి, సముద్రంలో ఆయిల్ రిగ్ పేల్చివేత, చేతక్ హెలికాప్టర్ విన్యాసాలు సందర్శకులను చూపు తిప్పుకోనివ్వలేదు. విద్యుత్ కాంతులతో యుద్ధనౌకల సందడి చేశాయి. వీటితో పాటు నౌకాదళ బ్యాండ్ వాయిద్య సంగీతం ఎంతగానో ఆకట్టుకుంది. విన్యాసాలను తిలకించేందుకు విశాఖ తీరానికి వేలాది మంది వీక్షకులు తరలివచ్చారు.